క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత

అడ్డాకుల: రోడ్డు ప్రమాదంలో గాయపడిన అడ్డాకుల గ్రామపంచాయతీ మల్టిపర్పస్ వర్కర్ బుడుగజంగం కుర్మన్న ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్ మంజుల, యాదవ సంఘం మండల అధ్యక్షుడు భీమన్నయాదవ్ గురువారం కుర్మన్న పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా జెడ్పీటీసీ ఎస్.రాజశేఖర్‌రెడ్డి రూ.5వేల ఆర్థికసాయం పంపగా, స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు ఖాజాఘోరి, శ్రీనివాస్‌యాదవ్, రమేష్, బాలరాజు, దానేలు పాల్గొన్నారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

దేవరకద్ర: మండలంలోని డోకూర్‌లో శుక్రవారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేయనున్నట్లు ఎంపీపీ రమాదేవి ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి హాజరవుతారని.. ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

నేడు వైద్యశిబిరం

చిన్నచింతకుంట: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆవరణలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు టీఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌ఎం ఖలీల్, జిల్లా కార్యదర్శి యాదగిరి ప్రకటనలో తెలిపారు. స్వస్తవా క్యాన్సర్ కేర్, ఆరోగ్య మహిళా కార్యక్రమం, తెలంగాణ బీడీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మహిళలకు వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అన్ని గ్రామాల మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీజేపీలోకి బాదేపల్లి మాజీ సర్పంచ్

జడ్చర్ల: బాదేపల్లి మాజీ సర్పంచ్ సీతారాం బీజేపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న కార్యక్రమంలో పార్టీ నేతల సమక్షంలో బీజేపీలో చేరనున్నారు. ఆయన గతంలో టీడీపీలో ఉండగా, బాదేపల్లి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్‌గా పనిచేశారు. తదుపరి బీఆర్‌ఎస్‌లో చేరిన ఆయన.. రెండేళ్లుగా పార్టీకి దూరంగా ఉన్నారు. ప్రధాని మోదీ చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధికి ఆకర్షితులై బీజేపీలో చేరుతున్నట్లు ఆయన 'సాక్షి'కి తెలిపారు.

'దళితుల మధ్య చిచ్చు పెట్టొద్దు'

మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణ కాలం చెల్లిన అంశమని, ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ రాజకీయ పార్టీల నేతలు తమ స్వార్థం కోసం దళితుల మధ్య చిచ్చు పెట్టడం తగదని జాతీయ మాలమహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి బ్యాగరి వెంకటస్వామి అన్నారు. జాతీయ మాలమహానాడు ఆధ్వర్యంలో గురువారం ఢిల్లీలోని తెలంగాణ భవన ఆవరణలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణ చెల్లదని, ఇది రాజ్యాంగ విరుద్ధమని తీర్పునివ్వడం జరిగిందని గుర్తుచేశారు. కానీ రాజకీయ పార్టీలు దళితుల ఓట్ల కోసం ఎస్సీ వర్గీకరణ అంశాన్ని తీసుకొచ్చి, దళితుల మధ్య చిచ్చు పెడుతున్నారని ధ్వజమెత్తారు. స్వార్థ రాజకీయాలకు పాల్పడే వారికి తగిన బుద్ధి చెప్పేందుకు మాలలు సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ర మేష్, సుధాకర్, అంజయ్య, శ్రీరాములు, సుదీ ర్, పురుషోత్తం, లక్ష్మణ్, శరత్‌రావు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

హన్వాడ: మండలంలోని పెద్దదర్‌పల్లి సమీపంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ రవినాయక్ వివరాల మేరకు.. మహబూబ్‌నగర్ మండలం తిమ్మసానిపల్లికి చెందిన రాజు గ్రామ సమీపంలోని వాగుల నుంచి ఇసుకను తరలించడంతోపాటు ఫిల్టర్ ఇసుక తయారు చేసి ట్రాక్టర్‌లో రవాణా చేస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తుండగా, పెట్రోలింగ్ పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి, రాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పాఠశాలలో చోరీ

నవాబుపేట: మండలంలోని యన్మన్‌గండ్ల ప్రభుత్వ పాఠశాలలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. ఎస్‌ఐ పురుషోత్తం వివరాల మేరకు.. మనఊరు–మనబడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలకు తీసుకొచ్చిన ఆరు బ్యాటరీలు, ఇన్వర్టర్, ఫ్యాన్లు చోరీకి గురయ్యాయి. వీటి విలువ దాదాపు రూ.70వేలు ఉంటుందని, పాఠశాల హెచ్‌ఎం వనజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

యువతి అదృశ్యం

నవాబుపేట: మండలంలోని కొల్లూరుకు చెందిన యువతి (19) అదృశ్యమైనట్లు ఎస్‌ఐ పురుషోత్తం తెలిపారు. బుధవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదని, ఆమె కోసం కుటుంబ సభ్యులు వెతికినా ఫలితం లేకపోయిందని పేర్కొన్నారు. యువతి తండ్రి ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా రుద్రారం గ్రామానికి చెందిన మహేష్ యువతిని ప్రేమ పేరుతో వేధింపులకు గురిచేసే వాడని, అతడిపై అనుమానం ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు.

చదువుతో పాటు క్రీడలు అవసరం



జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన కోడ్గల్ విద్యార్థులు



అడ్డాకులలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

అడ్డాకుల: విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు అవసరమని ఎంపీపీ నాగార్జునరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో గురువారం ఎస్‌జీఎఫ్ మండలస్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో శారీరక దారుఢ్యంతోపాటు మానసిక ఉల్లాసం లభిస్తుందన్నారు. విద్యార్థులు క్రీడల్లోనూ రాణించి మంచిపేరు తెచ్చుకోవాలని సూచించారు. అండర్–14, 17 విభాగాల్లో బాలబాలికలకు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం మండలస్థాయి జట్లను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రంగన్నగౌడ్, హెచ్‌ఎం జ్యోతి, ఉమాపతిరెడ్డి, జుర్రు నారాయణ, రాజవర్ధన్‌రెడ్డి, రాకేష్, చిన్నయ్య, బలరాంగౌడ్, అంజయ్యగౌడ్ పాల్గొన్నారు.

జడ్చర్ల: మండలంలోని కోడ్గల్ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. గురువారం బాదేపల్లి బాలుర జెడ్పీహెచ్‌ఎస్ ప్రాంగణంలో నిర్వహించిన అండర్–14, 17 విభాగాల్లో బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడాపోటీలు నిర్వహించారు. అండర్–14 బాలికల కబడ్డీ టోర్నీలో కోడ్గల్ పాఠశాల విద్యార్థులు బంగారు పతకం, అండర్–17 బాలుర విభాగంలో రజత పతకం సాధించినట్లు పీఈటీ శంకర్‌నాయక్ తెలిపారు. అదేవిధంగా అండర్–14 బాలికల వాలీబాల్, ఖోఖో, అండర్–17 బాలుర విభాగంలో రజత పతకాలను సాధించినట్లు పేర్కొన్నారు. పాఠశాల నుంచి మొత్తం 33మంది జిల్లాస్థాయి క్రీడలకు ఎంపికయినట్లు తెలిపారు.

మౌంట్‌బాసిల్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న మౌంట్‌బాసిల్ స్కూల్ యాజమాన్యం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: మండలస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో మౌంట్ బాసిల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీల్లో సత్తా చాటి జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం చంద్రకళావెంకట్, డైరెక్టర్లు సుశాంత్‌కృష్ణ, పూజితామోహన్‌రెడ్డి, శిరీషాప్రవీణ్, ప్రిన్సిపాల్ సురేష్ విద్యార్థులకు మెమొంటోలు అందజేసి అభినందించారు.

సీఈఐఆర్‌తో సెల్‌ఫోన్ల గుర్తింపు



జిల్లా కేంద్రంలో సెల్‌ఫోన్లు అప్పగిస్తున్న సీఐ సైదులు

మహబూబ్‌నగర్ క్రైం: చోరీలకు గురైన సెల్‌ఫోన్లను సీఈఐఆర్ పరిజ్ఞానంతో గుర్తిస్తున్నట్లు సీఐ సైదులు తెలిపారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆరుగురు బాధితులకు సెల్‌ఫోన్లు అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మిస్ అయిన సెల్‌ఫోన్‌లను సీఈఐఆర్ టెక్నాలజీతో గుర్తించి, బాధితులకు అందజేస్తున్నట్లు తెలిపారు. ఇందుకు కృషి చేసిన సిబ్బంది శేఖర్, పవన్‌కుమార్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డిని సీఐ అభినందించారు.

అడ్డాకుల: మూసాపేట మండలం తిమ్మాపూర్‌కు చెందిన శ్రీను పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను ఎస్‌ఐ శ్రీనివాసులు గుర్తించి, బాధితుడికి అప్పగించారు. సాంకేతిక పరిజ్ఞానంతో సెల్‌ఫోన్‌ను రికవరీ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

లక్ష్మణ్ బాపూజీ జీవితం.. అందరికీ ఆదర్శం

మహబూబ్‌నగర్ రూరల్: స్వాతంత్య్ర సమరయోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం అందరికీ ఆదర్శమని తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మచ్చ ప్రభాకర్‌రావు అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం జిల్లా కేంద్రంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాల్లో ముఖ్యపాత్ర పోషించారన్నారు. తెలంగాణ కోసం మంత్రి పదవిని సైతం తృణప్రాయంగా వదిలేసిన మహానేత అని కొనియాడారు. కాగా శివమార్కండేయ ఆలయ ప్రాంగణంలో లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేశారు. కౌన్సిలర్ రవికిషన్‌రెడ్డి, పద్మశాలి సంఘం జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు అనంతరాములు, కార్యదర్శి శంకర్, సూర్యప్రతాప్, సత్యనారాయణ, వెంకటేష్, జన్ను వెంకటేష్, శివాజీ, భీంపల్లి శ్రీకాంత్, బాలరాజు పాల్గొన్నారు.

వరిలో కాండం తొలుచు పురుగుతో నష్టం



యన్మన్‌గండ్లలో వరిపంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

నవాబుపేట: వరిపంటలో కాండం తొలుచు పురుగు వ్యాపిస్తే పంట దిగుబడి తగ్గుతుందని ఏరువాక శాస్త్రవేత్తలు భరత్‌భూషన్, అర్చన అన్నారు. గురువారం మండల కేంద్రంతోపాటు యన్మన్‌గండ్ల, కామారం, పోమాల్ గ్రామాల్లో వరిపంటను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం వరిపంటకు సోకుతున్న కాండం తొలుచు పురుగు నివారణకు తగు చర్యలు వెంటనే చేపట్టాలని రైతులకు సూచించారు. కాండం తొలుచు పురుగు వచ్చిందని నిర్ధారణకు రాగానే 60 ఎంఎల్ క్లోరోట్రానిలీప్రోల్ మందును 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరా పొలానికి పిచుకారీ చేయాలన్నారు. అదేవిధంగా పంటలకు మోతాదుకు మించి క్రిమిసంహారక మందుల వాడకం తగ్గించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ కృష్ణకిశోర్ పాల్గొన్నారు.

రైతు సంఘాలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



సదస్సులో మాట్లాడుతున్న కిల్లె గోపాల్

మహబూబ్‌నగర్ న్యూటౌన్: కేంద్ర ప్రభుత్వం రైతు సంఘాలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం సంయుక్త కిసాన్‌మోర్చా జిల్లాస్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకుడు ఎ.రాములు, సీఐటీయూ కిల్లె గోపాల్, రైతు కూలీ సంఘం నాయకుడు సీహెచ్ రాంచందర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కడియాల మోహన్, ఏఐకేఎంఎస్ ఆల్వాల్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నల్ల చట్టాల రద్దు కోసం జరిగిన పోరాటంలో 750మంది రైతులు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. 14 నెలలపాటు జరిగిన పోరాటంతో ప్రభుత్వం దిగివచ్చి రైతు చట్టాలను ఉపసంహరించుకుంటున్నట్లు పేర్కొందని చెప్పారు. ఆ సమయంలో రైతు సంఘాలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. సదస్సులో రాములు, శివలీల, నాగమ్మ, భాస్కర్, వెంకటయ్య, హనుమంతు ఉన్నారు.

పేస్కేలు అమలు చేయాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పంచాయతీరాజ్ శాఖలో పని చేస్తున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్లకు పేస్కేల్ అమలు చేయడంతోపాటు ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ల సమస్యలను పరిష్కరించాలని ప్రాజెక్టు మేనేజర్ నవీద్ కోరారు. ఈ మేరకు గురువారం ఇన్‌చార్జ్ అడిషనల్ కలెక్టర్ యాదయ్య, డీపీఓ వెంకటేశ్వర్లకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ప్రాజెక్టు మేనేజర్లకు పేస్కేల్ అమలుతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లకు జూనియర్ అసిస్టెంట్ పేస్కేల్ అమలు చేయాలన్నారు. మహిళా ఉద్యోగులందరికీ వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ప్రకటించాలన్నారు. విధి నిర్వహణలో ఎవరైనా మరణిస్తే వారి కుటుంబంలో ఒకరికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కిశోర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలపై నిర్బంధం ఆపాలి



జడ్చర్లలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేపట్టిన అంగన్‌వాడీలపై నిర్బంధం ఆపాలని సీఐటీయూ నాయకుడు కిల్లె గోపాల్ ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాకు నాయకత్వం వహించిన సీఐటీయూ జిల్లా కార్యదర్శి కురుమూర్తిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయడాన్ని ఖండించారు. 11 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలను చర్చలకు పిలవకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు.

జడ్చర్ల: పట్టణంలో అంగన్‌వాడీ కార్మికులు అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సత్తయ్య, ప్రభావతి, సరోజ, జ్యోతి, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

బాలనగర్: మండల కేంద్రంలో అంగన్‌వాడీల సమ్మె కొనసాగింది. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, రూ.26వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఆయుర్వేదంపై అవగాహన ఉండాలి



విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ లావణ్య

అడ్డాకుల: ఆయుర్వేద వైద్యంపై అందరూ అవగాహన పెంచుకోవాల్సిన అవసరముందని ఆయుర్వేద డాక్టర్ లావణ్య అన్నారు. మండలంలోని వడ్డెపల్లి పాఠశాలలో గురువారం విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులను ఆయుర్వేద వైద్యంతో నయం చేసే అవకాశం ఉందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీకాంత్, ఉపాధ్యాయురాలు రమాదేవి పాల్గొన్నారు.

రూ.2లక్షలు ఇస్తేనే దళితబంధు



ధర్నా చేస్తున్న పారుపల్లి గ్రామస్తులు

కోయిల్‌కొండ: రూ.2లక్షలు ఇస్తేనే దళితబంధు ఇస్తున్నారని, అర్హులైన వారికి పథకం దక్కడం లేదని మండలంలోని పారుపల్లికి చెందిన దళితులు గురువారం పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. గ్రామంలో 500మందికిపైగా దళితులు ఉన్నా 15మందికి మాత్రమే మంజూరు చేశారని, అదీ కూడా బీఆర్‌ఎస్ నాయకులకే ఇచ్చారని ఆరోపించారు. అర్హులందరికీ దళితబంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీరన్న, ఆంజనేయులు, రాజు, బాలకిష్టయ్య, రాములు, దాసు, రాజేందర్, చెన్నమ్మ, లక్ష్మమ్మ, లింగమ్మ, నాగమ్మ పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట



రైతుబీమా చెక్కు అందజేస్తున్న జెడ్పీటీసీ ఇంద్రయ్యసాగర్

అడ్డాకుల: రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసి పథకాలను అమలు చేస్తోందని జెడ్పీటీసీ జి.ఇంద్రయ్యసాగర్ అన్నారు. మూసాపేట మండలం జానంపేటకు చెందిన రైతు కందూరు బాలయ్య ఇటీవల మృతి చెందాడు. అతడి కుటుంబానికి ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.5లక్షల రైతుబీమా చెక్కును గురువారం జెడ్పీటీసీ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆంజనేయులు, కొండయ్య, మల్లయ్య, శివరాములు, కృష్ణయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల సమ్మె నోటీస్

దేవరకద్ర: ఆశా కార్యకర్తల డిమాండ్లను నెరవేర్చాలని ఈనెల 25 నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు సంఘం అధ్యక్షురాలు బాల సరస్వతి, హేమలత, కవిత, మహేశ్వరి తెలిపారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ శ్రీనివాసులుకు సమ్మె నోటీస్ అందజేశారు. ఆశా కార్యకర్తలకు కనీస వేతనం అమలు చేయాలని, ప్రభుత్వపరంగా అన్ని సౌకర్యాలు కల్పించాలని, వారానికి ఒకరోజు సెలవు ఇవ్వాలని, పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు.

సెల్ఫీ విత్ గణేశ్

మీరు పర్యావరణ పరిరక్షణలో భాగమై మట్టి గణేశుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించారా.. జిల్లాలోని అపార్ట్‌మెంట్, కమ్యూనిటీ లేదా ఇళ్లలో ప్రత్యేక ఆకృతుల్లో ఏర్పాటు చేశారా. అయితే మీ విగ్రహ ప్రత్యేకతలను 'సాక్షి'తో పంచుకోండి. మట్టి, ప్రత్యేక ఆకృతుల విగ్రహాలతో సెల్ఫీ తీసి వాట్సాప్ చేయండి. మీ పేరు, చిరునామాను స్పష్టంగా పంపించండి. ఎంపిక చేసిన ఫొటోలను ప్రచురిస్తాం.

వాట్సాప్ చేయాల్సిన నంబర్ 95056 96699





అరుణ, నవిత, పాల్కొండ, జి.శాంతారెడ్డి, టీచర్స్‌కాలనీ పార్క్, మహబూబ్‌నగర్



వాగ్దేవి జూనియర్ కళాశాల, న్యూటౌన్, మహబూబ్‌నగర్



వర్షిణి, సగరకాలనీ, మహబూబ్‌నగర్



మణి ఆనంద్‌కుమార్, సుభాష్‌నగర్



శ్రీభవ్య, రైల్వేస్టేషన్ రోడ్డు, మహబూబ్‌నగర్



జయరామ మోటార్స్, మెట్టుగడ్డ

రఘుమారెడ్డి సేవలు చిరస్మరణీయం



రఘుమారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

జడ్చర్ల టౌన్: తెలుగు అధ్యాపకుడు వెల్దండ రఘుమారెడ్డి విద్యార్థులకు అందించిన సేవలు చిరస్మరణీయమని సంగీత, నాటక అకాడమీ మాజీ చైర్మన్ శివకుమార్ అన్నారు. పట్టణంలోని ఉదయ మెమోరియల్ హైస్కూల్‌లో గురువారం చంద్రశేఖర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో రఘుమారెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని బీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పదేళ్లపాటు అధ్యాపకుడిగా పనిచేసి ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దారని అన్నారు. తెలుగు కళలకు జీవం పోషించారని కొనియాడారు. అంతకుముందు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రఘుమారెడ్డి మనవడు, వేద గురుకుల పాఠశాల నిర్వాహకుడు ఆచార్య తేజస్సు, ఆర్‌ఎస్‌ఎస్ నాయకుడు గుండేరావు, సీనియర్ సిటిజన్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు జగపతిరావు, జడ్చర్ల అధ్యక్షుడు కాత్రపలి లక్ష్మయ్య, శంకర్‌బాబు, రాధేశ్యామ్, చంద్రమౌళి, శాంతాభాయి, బాద్మి సుఖదాదేవి, రవిశంకర్, దత్తుకుమార్, విఠలయ్య, అశోక్‌యాదవ్, చిత్తనూరి ఈశ్వర్, సదాశివయ్య, అయ్యన్న పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యం తగదు

హన్వాడ: పారిశుద్ధ్య కార్మికుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని యూనియన్ నాయకులు అన్నారు. మండల కేంద్రంలో గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమ్మె సమయంలో కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై జాప్యం చేస్తున్నట్లు తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చకపోతే మరోమారు ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. బాలకిష్టయ్య, చెన్నయ్య, సతీష్, భీమయ్య, రంగయ్య, రాములు, అంజయ్య, వెంకటయ్య, పుల్లయ్య, దశరథం పాల్గొన్నారు.


సురక్ష పోలీస్ కళాజాత

భూత్పూర్: సురక్ష పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళలు, బాలికలను ఎవరైనా వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బాల్యవివాహాలను అరికట్టేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో డి.రాములు, జగదీష్, శివరాములు, మురళీధర్‌గౌడ్, ప్రేమ్‌కుమార్, గద్దం ఎల్లప్ప, కృష్ణయ్యగౌడ్, లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల ధర్నా

జడ్చర్ల టౌన్: పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఎమ్మార్పీఎస్ నాయకులు 44వ జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపై ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీను, రాజు, శివ, కృష్ణయ్య, ఆంజనేయులు, రమేష్ పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం



దేవరకద్రలో అన్నదానం చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

దేవరకద్ర/నవాబుపేట: దేవరకద్ర, నవాబుపేట మండలాల్లో కొలువుదీరిన గణనాథులకు గురువారం విశేష పూజలు చేశారు. దేవరకద్ర తీగలప్ప కట్ట వద్ద ఏర్పాటు చేసిన గణనాథుడి మండపం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నిబంధనలు పాటించాలి

చిన్నచింతకుంట: గణేష్ నిమజ్జనోత్సవం సందర్భంగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఉత్సవ కమిటీ సభ్యులకు ఎస్‌ఐ శేఖర్ సూచించారు. డీజేలకు అనుమతి లేదని, ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వేడుకలు నిర్వహించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు.